# వైభవంగా హనుమాన్ జయంతి


రామగాయత్రి హోమంలో పాల్గొన్న భక్తులు


శ్రీఆంజనేయం మజిల్ ప్లానెట్ జిమ్‌లో పూజలు చేస్తున్న యువకులు


జ్యూట్‌మిల్లు రామాలయంలో పంచముఖ ఆంజనేయునికి పూజలు చేస్తున్న భక్తులు


మానం ఆంజనేయులు నగర్‌లోని పంచముఖ ఆంజనేయ స్వామి


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

**తగరపువలస :** హనుమాన్ జయంతి వేడుకలు శనివారం భీమిలి అర్బన్, రూరల్ మండల పరిధిలో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే హనుమంతునికి గంధ, సింధూరాలతో అర్చనలు, పాలాభిషేకాలు నిర్వహించారు. తమలపాకులు, నిమ్మకాయలు, అప్పాలు, గారెలు, మామిడిపండ్ల దండలతో అలంకరించారు. రామగాయత్రి హోమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు ఆకెళ్ల భాగ్యరాజ్ శర్మ, గణేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. రంగూరి సీతారామదొర, ఆదిమూలం నాగరాజు, చెన్నా వెంకటేష్, కొత్తా రామకృష్ణ, మాకాల వెంకట అప్పారావు, మేకల శ్రీను, సైలాడ మల్లిబాబు తదితరులు సహకారం అందించారు. తగరపువలస శ్రీఆంజనేయం మజిల్ ప్లానెట్ జిమ్‌లో చీఫ్ కోచ్ బోర కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఆంజనేయునికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ప్రధాన కూడలిలోని ఎంఎఫ్‌సీ ఎదురుగా గల ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు జయరాం ఆధ్వర్యంలో ఆంజనేయునికి ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. చిల్లపేట - జీరుపేట గ్రామాల మధ్య హనుమాన్ కాలనీలో అన్నదానం ఏర్పాటు చేశారు. సంగివలస, అల్లూరి సీతారామరాజు కాలనీల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమిలి మండలం తాటితూరు, మజ్జివలస, చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, ఎర్రయ్యపాలెం, మూలకుద్దు, బ్యాంకు కాలనీ, తాళ్లవలస, ఆనందపురం మండలంలో పెద్దిపాలెం, లొడగలవానిపాలెం, దుక్కవానిపాలెం గ్రామాల్లోనూ హనుమత్ జయంతి వేడుకలను అక్కడి ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు.

**భీమునిపట్నం :** భీమిలిలోని శ్రీసీతారామ లక్ష్మణ సహిత శ్రీదాస ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం హనుమత్ జయంతి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో విచ్చేయగా ఆలయ అర్చకులు వంశీమోహన కృష్ణమాచార్యులు ఉదయం 108 కొబ్బరికాయలతో ప్రత్యేక పూజ, పంచామృత, ఫలరస, సుగంధ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు.

**పద్మనాభం :** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణాపురం, అనంతవరం, తునివలస, పాండ్రంగి, కురపల్లి, ఇసకలపాలెం, కోరాడ, రెడ్డిపల్లి కృష్ణ చంద్ర బాబాజీ మఠం ప్రాంగణంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణ చంద్రబాబాజీ మఠం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

- మద్ది జంక్షన్‌లోని హనుమాన్ ఆలయం 21వ వార్షికోత్సవం, హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. 2004 జూన్ ఒకటిన ఒకే రోజున ఈ రెండు వేడుకలు నిర్వహించారు. మళ్లీ 20 ఏళ్ల తర్వాత ఒకేసారి వచ్చాయి. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, బుగత సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**తగరపువలస :** ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ప్రసాదరావు, సర్పంచ్ బావిశెట్టి రాజు, కూరాకుల వెంకటేశ్వరరావు, గుడిలోవ నీటి సంఘం మాజీ అధ్యక్షుడు చిన్నయ్యపాత్రుడు, గుండు మురళి, ప్రముఖ వర్తకులు చెన్నా రామారావు, చెన్నా వెంకటేశ్వరరావు, చెన్నా సత్యనారాయణ, కూరాకుల మురళి, ఈశ్వరరావు, గుండు చిన్న, కూరాకుల ప్రసాద్, సత్యారావు, మరుపిల్ల చిన్న, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు వేల మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశారు.

**కొమ్మాది :** భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట దరి రామాద్రి హంసవన పుణ్యక్షేత్రంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 9 వరకు పంచామృతాభిషేకాలు, సహస్ర సింధూర, తమలపాకుల పూజ, సాయంత్రం 5 గంటల నుంచి 6 వరకు హనుమాన్‌చాలీసా పారాయణ, అనంతరం రథోత్సవం నిర్వహించారు. ఎండాడలో గల రామాలయంలో, కె.నగరపాలెం పరిధి కాపులదిబ్బడపాలెంలో, చేపలుప్పాడ హనుమాన్ ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**పీఎం పాలెం :** జీవీఎంసీ 6వ వార్డు వైష్ణవ దేవాలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఎం పాలెం ఆఖరి బస్టాప్ - బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ శృంగేరి శంకర మఠంలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా స్వామిని అలంకరించారు. మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వేంకటేశ్వర్లు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రామాలయం ప్రాంగణంలో గల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదం పంచిపెట్టారు.


**మధురవాడ :** హనుమజ్జయంతి ఉత్సవాలను మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో గల ఆలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి నిమ్మకాయలు, తమలపాకులు, గారెలు, పూల దండలు వేసి విశేషంగా అలంకరించారు. జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలోని పంచముఖ ఆంజనేయ స్వామికి చెర్రీపళ్లు, తులసి, నిమ్మకాయలు, తమలపాకులు, గారెలు, పువ్వులతో విశేషంగా అలంకరించారు. అనంతరం విశాఖవాసులు పార్వతీశం దంపతులు, భక్తుల సహకారంతో అన్నప్రసాదం పంచి పెట్టారు. హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. పీఎంపాలెం పద్మశాలీ ఆత్మీయ సేవా సంఘానికి చెందిన పప్పు సత్యరామ స్వామి సహకారంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ధర్మకర్త పిల్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిల్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, కార్యవర్గ సభ్యులు పీవీజీ అప్పారావు, పిల్లా శ్రీనివాసరావు, పిల్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, గ్రామ పెద్దలు పిల్లా శ్రీనివాసరావు, పిల్లా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు నగర్‌లో గల శ్రీ లలితా త్రిపుర సుందర సమేత మహా కామేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామికి విశేష అలంకరణ చేశారు. ఈ సందర్భంగా శాంతి హోమం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, సోమేశ్వరరావు, విజయ్ కుమార్, వెంకటరావు, రమణయ్య, రాము తదితరులు పాల్గొన్నారు. అలాగే మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం, మారికవలస ఆర్‌జీకే కాలనీలు, బోరవానిపాలెం, బొట్టవానిపాలెం, తదితర ఆలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు.


వేడుకల్లో పెద్దిపాలెం ఆలయ కమిటీ ప్రతినిధులు


మధురవాడలో హనుమాన్ జయంతి పూజల్లో భక్తులు


గంధం అలంకరణలో హనుమాన్


పూజలు అందుకున్న హనుమాన్


శ్రీ శృంగేరి మఠంలో విశేష అలంకరణలో స్వామివారు


రెడ్డిపల్లిల్లో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


విశేష అలంకరణలో పంచముఖ ఆంజనేయ స్వామి


మద్ది జంక్షన్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ రాంబాబు, భక్తులు


దుర్గాలమ్మ ఆలయం వద్ద అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న సభ్యులు

## క్లుప్తంగా

### ఘనంగా ఆలయాల వార్షికోత్సవం

**పద్మనాభం :** పద్మనాభం జంక్షన్‌లోని షిర్డీ సాయి, పార్వతమ్మ ఆలయాల 20వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, మండపారాధన, పరిషత్, అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు, కృష్ణాపురం సర్పంచ్ మొకర లక్ష్మి భవానీ పూజలు చేశారు.

### ఫాదర్ ప్రభుదర్శనం దంపతులకు సత్కారం


ప్రభుదర్శనం దంపతులను సత్కరిస్తున్న చర్చి సంఘ సభ్యులు

**భీమునిపట్నం:** భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న చారిత్రిక సెయింట్ పీటర్స్ చర్చి ఫాదర్ రెవరెండ్ ప్రభుదర్శనంను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కులిడి సురేష్‌బాబు మాట్లాడుతూ 160 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ చర్చిలో ఫాదర్ ప్రభుదర్శనం ప్రత్యేక సేవలు అందించారని కొనియాడారు. అనంతరం ప్రభుదర్శనం, ఆయన భార్య లత దంపతులను ఘనంగా సత్కరించారు. చర్చి సంఘ సభ్యులు సుధాకర్, శేఖర్, సాగర్, హరిబాబు, విజయ్, లత, మేరీ, విజయభారతి, కుమారి, రాజేష్, శామ్యుల్ పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వృద్ధుడి మృతి

**పీఎం పాలెం :** రోడ్డు పక్కన పడి వున్న వృద్ధుడిని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 28న జీవీఎంసీ 6వ వార్డు రేవెళ్లపాలెం రోడ్డు పక్కన పడి ఉన్న 70 సంవత్సరాల వృద్ధుడిని స్థానిక సచివాలయం గ్రేడ్ - 2 వీఆర్‌వో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడు ఓ యాచకుడని గుర్తించారు.

### పద్మనాభంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం


పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

**పద్మనాభం :** పద్మనాభం గ్రామంలో శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య సిబ్బంది, ప్రజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీవితంలో పొగాకు, ఇతర పొగాకు ఉత్పత్తులు వాడనని అందరూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మణికుమారి, వైద్యాధికారులు స్వప్న, సందీప్, ఎంపీహెచ్‌ఏఎం ఎం.రామకృష్ణ, ఆశ వర్కర్ పి.లక్ష్మి పాల్గొన్నారు.

### 11 మద్యం సీసాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

**తగరపువలస :** భీమిలి మండలం తాళ్లవలసలో శనివారం భీమిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ఎ.శ్రీను అనే వ్యక్తి నుంచి 11 క్వార్టర్ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చిన్నంనాయుడు తెలిపారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తుల సమాచారం అందించాలని ఆయన కోరారు.



## క్యాన్సర్ బాధితునికి రూ.28 వేల సాయం


బాధిత బాలునికి ఆర్థిక సాయం అందిస్తున్న జై జవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు

**తగరపువలస :** క్యాన్సర్‌తో బాధపడుతున్న విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లికి చెందిన ఐదేళ్ల బాధితుడు బాడితబోయిన సాయిగణేష్‌కు ఆనందపురంలోని జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు శనివారం వైద్య సహాయం నిమిత్తం రూ.28 వేలు అందించారు. ఏడాది కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న సాయిగణేష్ నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుని తల్లిదండ్రులు రాంబాబు, సన్యాసమ్మ అభ్యర్థన మేరకు జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు స్పందించి సామాజిక మాధ్యమాల ద్వారా చందాలు సేకరించారు. ఆనందపురం జెడ్పీ హైస్కూల్ 2007 బ్యాచ్ తరపున కోటేశ్వరరావు రూ.5 వేలు, సీఆర్‌పీఎఫ్ 416వ బ్యాచ్ జవాన్లు రూ.5 వేలు అందించారు. బాధిత కుటుంబానికి వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, కార్యదర్శి ముడసల కార్తీక్, ప్రధాన కార్యదర్శి ఇమంది శ్రీనివాసరావు, కోశాధికారి కుప్ప రామలక్ష్మి, కుప్ప శ్రీను, కుప్ప అప్పారావు, శ్రీను, చిరంజీవి, రాము, గణేష్ ఆనంద్, రాజు, వంశీ, బంగార్రాజు తదితరులు సాయం అందించారు.

## అందుబాటులోకి సీబీసీటీ స్కాన్


సీబీసీటీ స్కాన్ ప్రారంభిస్తున్న జాతీయ దంత వైద్య కౌన్సిల్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ రెడ్డి

**తగరపువలస :** సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో శనివారం అత్యాధునిక సీబీసీటీ స్కాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనిని జాతీయ దంత వైద్య కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సతీష్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటి రోగాలు గుర్తించడం, చికిత్సా ప్రణాళికలో ఈ ఆధునిక పరికరం ఉపయోగపడుతుందన్నారు. కళాశాల డీన్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ విశాఖ, విజయనగరం వంటి ప్రాంతాలకు వెళ్లకుండా భీమిలి చుట్టూ ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిల్లర వర్తకులకు అండగా వుంటాం

**మధురవాడ :** చిల్లర వర్తకుల ఉపాధి పరిరక్షణకు అండగా వుంటామని వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన ప్రసాద్, జనసేన నాయకుడు సంతోష్‌నాయుడు, సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు భరోసా ఇచ్చారు. కార్‌షెడ్ నుంచి పీఎంపాలెం చివరి బస్టాప్ వరకు జోన్ - 2 జీవీఎంసీ అధికారులు, పీఎంపాలెం పోలీసులు శుక్రవారం పలు తోపుడు బళ్లు, నేలపై ఉన్న వివిధ రకాల చిల్లర వర్తకుల దుకాణాలు తొలగించడాన్ని ఖండించారు. దీనికి వ్యతిరేకంగా శనివారం పీఎంపాలెం 2వ బస్టాప్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రహదారిపై ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా వర్తకం చేసుకోవాలని వర్తకులను కోరారు. చిల్లర వర్తకులపై జీవీఎంసీ సిబ్బంది, పోలీసులు దాడులకు దిగితే సహించేది లేదన్నారు. వర్తకుల నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రి, తోపుడు బండ్లు తిరిగిచ్చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు లోకనాథం, పి.పాత్రుడు, రవికుమార్, ఎం.సురేంద్ర, అచ్యుతరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన ప్రసాద్

## చెరువులో వాటర్ ట్యాంకర్ బోల్తా


చెరువులో పడిన వాటర్ ట్యాంకర్

**కొమ్మాది :** జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ రాజు గారి చెరువులో శనివారం ఓ వాటర్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రాంతంలో ఓ చోట నుంచి అనధికారికంగా భారీ ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని తరలిస్తుంటారు. ఈ క్రమంలో వాటర్ ట్యాంకర్ లోడ్‌తో వస్తుండగా ఇక్కడ చెరువు వద్ద ఒక్కసారిగా బోల్తాపడింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్ చాకచక్యంగా బయటపడ్డాడు. గతంలో ఈ చెరువు వద్ద నీటిని తోడుతుండగా అధికారులు హెచ్చరించారు. అయినప్పటికీ కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం ఇక్కడి నీటిని అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

**దాబాగార్డెన్స్ :** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

## రెండు ఆలయాల్లో హుండీలు చోరీ


మూలకుద్దు ఆలయ సమీపంలోని పొలంలో దొంగలు పడేసిన హుండీ

**తగరపువలస :** భీమిలి మండలం పాత మూలకుద్దు, చిప్పాడ పంచాయతీలోని రెండు ఆలయాల్లో శుక్రవారం రాత్రి దొంగలు హుండీలను కొల్లగొట్టారు. దివీస్ రహదారిని ఆనుకుని ఉన్న పాత మూలకుద్దు రామాలయంతోపాటు చిప్పాడ పంచాయితీలో షిర్డీసాయిబాబా ఆలయంలో దొంగలు పడ్డారు. వీళ్ల హుండీలను దగ్గరలోని వ్యవసాయ భూముల వద్ద పడేశారు. చోరీకి జరిగిన ఆలయాల్లో పెద్దగా కానుకలు లేకపోయినప్పటికీ ఇటీవల గ్రామదేవతల పండగలు వరుసగా జరుగుతున్నందున భక్తులు పెద్ద మొత్తంలో కానుకలు సమర్పించారు. చాలా ఆలయాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలు చోరీలకు పాల్పడుతున్నట్టు తెలిసింది. పోలీసులు నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు. ఈ రెండు ఆలయాలకు సంబంధించిన కమిటీ ప్రతినిధులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## త్వరితగతిన బీఆర్‌టీఎస్ విస్తరణ పనులు


బీఆర్‌టీఎస్ విస్తరణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

**దాబాగార్డెన్స్:** జీవీఎంసీ జోన్-8 పరిధి అడవివరం నుంచి పాత గోశాల వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రోడ్డు విస్తరణ పనులను శనివారం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, ముఖ్యంగా కాలువలు, కల్వర్టులతో పాటు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సింహాచలం దేవస్థానానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డుపై దుమ్ము, ధూళి లేవకుండా ఎప్పటికప్పుడు నీటిని చల్లాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్‌ను, జోనల్ కమిషనర్ హైమావతిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీర్ సుబ్బారావు, డీసీపీ పద్మజ, ఏసీపీ రఘునాథ్ పాల్గొన్నారు.

## ఎండల నుంచి పశువులను రక్షించుకోవాలి


లక్ష్మీపురంలో పశువులను పరిశీలిస్తున్న దాకమర్రి పశువైద్యాధికారి కాంతి కిరణ్

**తగరపువలస :** వేసవి వేడి నుంచి పశువులను రక్షించుకోవడానికి పాడి రైతులు చర్యలు తీసుకోవాలని భీమిలి మండలం దాకమర్రి పశువైద్యాధికారి జి.కాంతికిరణ్ సూచించారు. సాక్షిలో శనివారం ప్రచురించిన 'హీట్‌స్ట్రోక్‌తో పశువుల మృతి' వార్తకు ఆయన స్పందించారు. లక్ష్మీపురం, శింగనబంద పంచాయతీల్లోని పాడి రైతుల క్షేత్రాలను సందర్శించారు. వేసవి జాగ్రత్తలు వివరించారు. పశువుల శాలలకు తడిగోనెలు కట్టడం, సాయంత్రం వేళ పశువులను నీటితో తడపడం చేయాలన్నారు. ప్రభుత్వం గొంతు వాపు, జబ్బ వాపు వ్యాధులకు టీకాలు వేస్తున్నందున పాడిరైతులు వినియోగించుకోవాలన్నారు. అలాగే గొర్రెలు, మేకలకు కూడా చిటిక వ్యాధి టీకాలు వేయించాలని సూచించారు.